అర్హులైన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలి

మహిళా, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న అనిత రామచంద్రన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాల, జనవరి 23 : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హుల జాబితాలో పేరు రాలేదనే ఆందోళన చెందకుండా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనిత రామచంద్రన్ సూచించారు. గురువారం మండలంలోని పెద్దకాపర్తిలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలు అపోహలకు, ఆందోళనకు గురి కావద్దని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రకటించే జాబితా ఫైనల్ కాదని, దీని ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరుగదని పేర్కొన్నారు. అర్హులైన వారు ఇంకా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శ్రావణ్, తాసీల్దార్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రం పరిశీలన

చిట్యాలలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. పిల్లలతో ఆటలాడించారు. ప్రీ స్కూల్ మెటీరియల్‌ను,, ఆహారాన్ని పరిశీలించారు. కేంద్రంలో మరుగుదొడ్డి లేదని అంగన్‌వాడీ టీచర్ అపర్ణ వారి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్వచ్ఛ భారత్‌లో భాగంగా మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

గ్రామ సభల్లో ఘర్షణలకు తావివ్వవద్దు : ఎస్పీ

కనగల్‌లో గ్రామసభను సందర్శించి ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ సిటీ : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలో ఘర్షణలకు తావివ్వవద్దని, అర్హులైన ప్రజలందరూ శాంతియుతంగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. గురువారం కనగల్ మండలంలోని కనగల్, బచ్చనగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను ఆయన సందర్శించారు. కావాలని ఘర్షణలు సృష్టిస్తే చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్ఐ విష్ణుమూర్తి ఉన్నారు.

దేవరకొండ పట్టణ సమ్రగాభివృద్ధికి కృషి

- **ఎమ్మెల్యే బాలూనాయక్**

నీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

చందంపేట(దేవరకొండ), జనవరి 23 : దేవరకొండ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు కాలనీల్లో రూ.30 కోట్లతో పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ సుదర్శన్‌రెడ్డి, ఏఈ రాజు, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- **నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి**

క్రీడలను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నందికొండ, జనవరి 23 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం పావూరి రంజిత్ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల క్రీడలను వారు గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 20 ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలకు చెందిన 400 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నిరంజన్, అస్సార్, వెంకట్‌కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

నందికొండ, జనవరి 23 : నాగార్జునసాగర్ డ్యాం విజయపురి సౌత్ (ఆంధ్ర ప్రాంతం)లో విమానాశ్రయ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని గురువారం విమాన సర్వీసుల కేంద్ర బృందం పరిశీలించింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన స్థలాలు ఉన్నాయా అనే విషయాన్ని బృందం పరిశీలించింది. కేంద్ర బృందం సభ్యులు బుధవారం రాత్రి హిల్‌కాలనీ విజయవిహార్‌కు చేరుకోగా వారికి ప్రొటోకాల్ ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. కేంద్ర బృందంలో ఏఎస్ఎన్ మూర్తి, ప్రవీంద్ర తివారి, అరుణ్‌కుమార్, అమాన్ చిప్ప, సాజిజ్ అభిలాజ్, ఉస్మాన్ ఉన్నారు. వారితో గురుజాల ఆర్డీఓ మురలీకృష్ణ, మాచర్ల తాసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ అనిల్‌కుమార్ ఉన్నారు.

విద్యుత్ బస్సులకు వ్యతిరేకంగా 24, 25 తేదీల్లో నిరసన

నల్లగొండ సిటీ, జనవరి 23 : విద్యుత్ బస్సుల వల్ల ఆర్టీసీ కార్మికులకు జరిగే నష్టాన్ని నివారించాలని డిమాండ్‌తో ఈ నెల 24, 25 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆయా తేదీల్లో ఆర్టీసీ కార్మికులు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.

NLG-340012

PLOT FOR SALE

★ యాదాద్రి టెంపులకి సమీపంలో మోత్కూర్ రోడ్, చీమల కొండూరులో రూ. 3,999/-లకే గజం భూమి అమ్మబడును. ఈ ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే. Ph: 7989747927.

NT-327005

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.

NT-327009-All

CHANGE OF NAME

I, **SHEIK HAZEERA,** W/o. Shaik Jani, H.No.2-26, Seetharama puram (V), Chilkur (M), Suryapet (Dist.), Have changed my name from HAZEERA to SHEIK HAZEERA for all future purposes.

CHANGE OF NAME

I, **SHAIK JOHNBHE,** W/o. Shaik Babu, H.No.2-26, Seetharama puram (V), Chilkur (M), Suryapet (Dist.), Have changed my name from SHAIK JANIBEE TO SHAIK JOHN BHE for all future purposes

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ పథకాలన్నీ కాంగ్రెస్ నాయకులకేనా.?

- **గ్రామసభల్లో అధికారులను నిలదీసిన ప్రజలు**
- **ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని ఆగ్రహం**
- **మూడో రోజూ కొనసాగిన గందరగోళం**

కొండమల్లేపల్లి : చింతకుంట్లలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

వేములపల్లి:శెట్టిపాలెంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

నల్లగొండ రూరల్, జనవరి 23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు గురువారం మూడోరోజు జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. అయితే ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి జాబితాలో అన్ని కాంగ్రెస్ కార్యకర్తల పేర్లే ఉన్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ మండలంలోని రంగారెడ్డి నగర్, దోమలపల్లి, నర్సింగ్ భట్ల, చెన్నుగూడెం, కాకుల కొండరాం, పెద్ద సూరారం, జీకే అన్నారం, అన్నారెడ్డి గూడెం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లోనూ అనర్హులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారంటూ నిలదీశారు.

కట్టంగూర్ : మండలంలోని మల్లారం, పరడ, ముత్యాలమ్మగూడెం, పామనుగుండ్ల, చెర్వుఅన్నారం గ్రామాల్లో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. అయిటిపాములలో గ్రామ సభలో అధికారులు వివిధ పథకాలకు అర్హుల జాబితా చదవగానే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఉన్నవారి పేర్లు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హుల జాబితాలో ఎలా చేర్చారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని బలవతంతగా కూర్చోబెట్టారు. అర్హులు ఇంకా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమశాఖ జేడీ కోటేశ్వర్‌రావు సూచించారు.

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మాడ్గులపల్లి : బొమ్మకల్ గ్రామసభలో అధికారిని నిలదీస్తున్న స్థానికుడు

అమ్మనబోలులో వాగ్వాదం

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు, శేరుబాయిగూడెం, పోతినేనిపల్లి, శాపల్లి, తొండల్‌వాయి, ఔరవాణి, తిరుమలగిరి, ఎనుగులదోరి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని అమ్మనబోలు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ వాళ్లకే ఇస్తున్నారని, మరి తామెక్కడికి పోవాలని మహిళలు అధికారులను నిలదీశారు.

చిట్యాల : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితా తయారీలో అవకతవకలు జరిగాయని, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే పథకాలు అందించాలని మండలంలోని సుంకెనపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో జరిగిన గ్రామ సభలో జాబితాలో అనర్హుల పుర్లు ఉన్నాయని పేర్కొంటూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఉరుమడ్ల, చిన్నకాపర్తి, వనిపాకల, చిట్యాల పట్టణంలోని 9,10,11 వార్డుల్లో జరిగిన గ్రామసభల్లోనూ లబ్ధిదారుల ఎంపికపై ప్రజలు అధికారులను ప్రశ్నించారు.

ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలి

శాలిగౌరారం : రేషన్ కార్డు కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలు అధికారులను నిలదీశారు. శాలిగౌరారం గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో అర్హుల జాబితాలో తమ పేరు లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేవారు. ప్రజాపాలన, కులగణన సర్వే చేసినప్పుడు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశామని, అయినా జాబితాలో పేరు లేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో కొద్దిసేపు సభలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

గ్రామ సభల్లో నిరసనల వెల్లువ

నిడమనూరు : మండలంలోని శాఖాపురం, ఎర్రగూడెం, ముప్పారం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పథకాల అర్హుల జాబితాలో సంపన్నులకు చోటు కల్పించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే సరగా చేయలేదని, గ్రామసభ తమకు అవసరం లేదని, అధికారులు వెళ్లి పోవాలంటూ డిమాండ్ చేశారు. శాఖాపురంలో సాగు యోగ్యం కాని భూముల జాబితాలో చిత్రం చంద్రకళ పేరు రావడంతో ప్రజలు అధికారులపై మండిపడ్డారు. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశం సూచించారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో గురువారం వార్డు సభ నిర్వహించారు. అధికారులు చదివిన అర్హుల జాబితాలో గతంలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు లేవని మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ ప్రశ్నించారు. వార్డు సభల్లో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, పేదవారికి అన్యాయం జరుగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు మాత్రం తమ ఇష్టమొచ్చిన వారికే ఇస్తాం.. సభలో గోల చేస్తే బయటకు పంపుతామని చెప్పడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే పథకాలిస్తే ఇక సభ ఎందుకని 8వ వార్డు ప్రజలు సభను బహిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మునవ్వర్ అలీ, కౌన్సిలర్ తోకల వెంకన్న, బూతరాజు దశరథ, గండూరి జనార్దన్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఏమైనై

మర్రిగూడ : మండలంలోని అజిలాపురం, కొండూరు, కొట్టాల, ఖుదాభక్ష్‌పల్లి, నామాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అయితే తాము ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు రాలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ మునయ్య, అధికారులు పాల్గొన్నారు.

వేములపల్లి : మండలంలోని శెట్టిపాలెం, సల్కునూరు, కామేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. శెట్టిపాలెంలో సంక్షేమ పథకాల లిస్టులో తమ పేర్లు లేవని నిలదీశారు. ఇది మా ప్రభుత్వం మేము చెప్పిన వారికే పథకాలిస్తారంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడంతో బీఆర్ఎస్ నాయకుడు కట్టా మల్లేశ్‌గౌడ్, స్థానికులు తీవ్రంగా ఖండించారు. దాంతో కొద్దిసేపు వాగ్వాదాలు సాగాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రావు, తాసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ శారదాదేవి, అధికారులు పాల్గొన్నారు.

చందంపేట : మండలంలోని ముడుదండ్ల, పెద్దమూల గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. సభలో పథకాల అర్హుల జాబితాను ప్రకటించిన వెంటనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అనర్హులను జాబితాలో చేర్చారంటూ అధికారులను నిలదీశారు. ఎస్ఐ సతీశ్ వారిని శాంతిపజేశారు. ఎంపీడీఓ లక్ష్మి, ప్రత్యేకాధికారి ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

దేవరకొండరూరల్ : మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని అధికారులను మహిళలు నిలదీశారు. అనర్హులను ఎంపిక చేయడం సరికాదని పేర్కొన్నారు.

చందంపేట : ముడుదొడ్లలో నిరసన తెలుపుతున్న ప్రజలు

చండూరు : అర్హుల జాబితాలో తమ పేరు లేదని అడుగుతున్న వారిని అడ్డుకుంటున్న పోలీస్

చిట్యాల : సుంకెనపల్లిలో నిరసన తెలుపుతున్న ప్రజలు

శాలిగౌరారం:అర్హుల జాబితాపై ఆర్ఐని ప్రశ్నిస్తున్న యువకుడు

నేడు విద్యుత్ గ్రీవెన్స్ డే

నల్లగొండ సిటీ, జనవరి 23 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు గ్రీవెన్స్‌డేను వినియోగించుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తులు మృతి

నీలగిరి, జనవరి 23 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు ఆస్పత్రి అవుట్ పోస్టు ఇన్‌చార్జి మహ్మద్ హనీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని రేకుల షెడ్‌లో పడిపోయి ఉన్న వ్యక్తిని వెంటనే అసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి వద్ద ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన మందులు లభించినట్లు తెలిపారు. మరో వ్యక్తి(50) చర్మ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. వీరికి సంబంధించి సమాచారం లేనందున మృత దేహాలను మార్చురీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుల సంబంధీకులు ఉంటే నల్లగొండ టూటౌన్ ఎస్ఐని సంప్రదించాలని సూచించారు.

నకిలీ వేబిల్లుతో.. ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

మిర్యాలగూడ, జనవరి 23: నకిలీ వేబిల్లుతో శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి ఇసుకను అక్రమంగా మిర్యాలగూడకు తరలిస్తున్న టిప్పర్‌ను రవాణాశాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం నుంచి మర్రిగూడెం శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు ఇసుక తరలిస్తున్నట్లుగా వేబిల్లు తీసుకున్నారు. కానీ వంగమర్తి ఇసుక రీచ్ నుంచి మిర్యాలగూడ పట్టణానికి 64 టన్నులకు పైగా ఇసుకను తరలిస్తున్నారు. దాంతో మిర్యాలగూడ ఇసుక టిప్పర్ల అసోసియేషన్ ప్రతినిధులు వాహనాన్ని అడ్డగించి రవాణాశాఖ, పోలీసు అధికారులకు అప్పగించారు. ఎంవీఐ వీరస్వామి టిప్పర్ సీజ్ చేశారు. విచారణ కోసం మైనింగ్‌శాఖ అధికారులకు లేఖ రాస్తున్నట్లు ఎంవీఐ తెలిపారు.

తప్పులు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలి :ప్రత్యేక కలెక్టర్

త్రిపురారం, జనవరి 23: డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ సూచించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీ తాసీల్దార్ కార్యాలయంలో జరుగుతుండగా ఆయన పరిశీలించారు. అనంతరం పెద్దదేవులపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.లీలా, ఎంపీడీఓ విజయకుమారి, తాసీల్దార్ గాజుల ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు

- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, జనవరి 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలవంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా ఉద్యమాల ద్వారా ఎండగడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం పట్టణంలో గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఈదులగూడెంలోని సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జెండాను పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు. అక్కడి నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా రామచంద్రగూడెంలోని గాదె శ్రీనివాస్‌రెడ్డి స్తూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్తూపాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మెజారిటీ తగ్గినప్పటికీ తన స్వభావాన్ని మార్చుకోలేదన్నారు. రాజ్యాంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకొని ప్రజా స్వామ్యంపై దాడులు చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేశ్, నారి ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ

రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

తిరుమలగిరి(సాగర్), జనవరి 23: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని గురువారం డీఈఓ బొల్లారం భిక్షపతి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వంట గదిలోని సామగ్రిని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఓ కవిత ఉన్నారు.

నెల్లికంటి సత్యానికి పాల్వాయి స్రవంతి పరామర్శ

పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి

మునుగోడు, జనవరి23 : సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృమూర్తి పార్వతమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఎలగలగూడేంలోని సత్యం ఇంటికి వెళ్లి పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట నాయకులు మేకల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని అంజయ్యగౌడ్, మేకల ప్రదీప్‌రెడ్డి, చాపల శ్రీను, పాల్వాయి వెంకట్‌రెడ్డి, సురిగి రవి, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి లింగస్వామి, దామ మహేశ్, కొమ్ము లింగస్వామి, శ్రీశైలం ఉన్నారు.

తాను మరణించినా.. నలుగురికి జీవం

అంజయ్య(ఫైల్)

కట్టంగూర్, జనవరి 23 : తాను మరణించినా.. అవయవదానం ద్వారా మరో నలుగురికి జీవం పోశాడు కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన బంటు అంజయ్య. ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన బంటు అంజయ్య(62) ఈ నెల 14న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. గురువారం అతడి బ్రెయి న్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. జీవన్‌దాన్ ఫౌండేషన్ వారు అంజయ్య కుటుంబ సభ్యులను సంప్రదించగా అంజయ్య అవయవాలు దానం చేసేందుకు వారు అంగీకారం తెలిపారు. దాంతో అంజయ్య కిడ్నీలు, లివర్, కండ్లను సేకరించారు.

నేత్రదానం

రామగిరి : పానగల్‌కు చెందిన 2వ వార్డు సీపీఎం కార్యదర్శి దండెంపల్లి దశరథ(59) గురువారం మృతి చెందారు. అతడి కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదాన ట్రస్టు వారు ఐడోనేషన్ సెంటర్, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో ఐడోనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరి నాథ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి నిమ్మల పిచ్చయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర యాదయ్య, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ



కావమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, జనవరి 23 : అనుముల మండలం కొట్టాల గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి పెద మంగయ్య సతీమణి కావమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వారి ఇంటికి వెళ్లి కావమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మీసాల ఆంజనేయులు, రావుల చినభిక్షం, సంకూరి రాంబాబు, పెరుమల్ల ఎల్లయ్య, మొసంగి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఛాయా సోమేశ్వరాలయాన్ని సందర్శించిన పురావస్తుశాఖ డైరెక్టర్